క్లుప్తంగా

పచ్చిరొట్ట విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభం

కురిచేడు: ఖరీఫ్ సీజన్ కింద పచ్చిరొట్ట పంట విత్తనాలకు రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి ప్రకాశ్‌రావు తెలిపారు. జనుములు 10 కిలోలు 50 శాతం సబ్సిడీతో రూ.420, జీలుగ 10 కిలోలు రూ.395లు, పిల్లిపెసర 8 కిలోలు రూ.388 ధరగా ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గ్రామ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు అవసరమైన రైతులు పొలం పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో పాటు ఫోన్ ఓటీపీ ద్వారా విత్తన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

మోడల్ స్కూళ్లలో జిల్లా ఫస్ట్ మార్కాపురం

మార్కాపురం టౌన్: ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మోడల్ స్కూళ్లలో మార్కాపురం మండలం మిట్టమీదిపల్లి స్కూల్ అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ మురళి తెలిపారు. జిల్లాలో మిట్టమీదిపల్లి, రాచర్ల, పెద్దదోర్నాల, దర్శి, కనిగిరి, ముండ్లమూరులో ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. మార్కాపురం పాఠశాల విద్యార్థినులు కె.హేమలత, ఎం.సంకీర్తన 550 మార్కులు సాధించగా, 22 మంది 500కు పైగా మార్కులు, 68 మంది విద్యార్థులు ఫస్ట్ డివిజన్ మార్కులతో సత్తా చాటారు. 96.3 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన

దొనకొండ: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారులకు సమీకృత వ్యవసాయంపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి వైకేపీ ఏపీఎం జి.వెంకటేశ్వర్లు రైతులకు సూచనలు, సలహాలందించారు. గ్రామాల్లో 250 మంది 300 కుటుంబాలు ఒక క్లస్టర్‌గా ఏర్పడి సమీకృత వ్యవసాయం సాగు చేసేందుకు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి రైతు ప్రతి సంవత్సరం పంట మార్పిడి చేసుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందాలన్నారు. ఆర్‌బీకేల్లో విత్తనాలు సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. పశు వైద్యాధికారి దేవారెడ్డి నాయక్ పాల్గొన్నారు.

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌వర్ధన్



డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి

దర్శి: దర్శి డీఎస్పీగా అశోక్‌వర్ధన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దర్శిలో పని చేసిన డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి బదిలీపై ఒంగోలు వెళ్లారు. ఈ సందర్భంగా అశోక్‌వర్ధన్ మాట్లాడుతూ ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. పోలీస్ సిబ్బంది సహకారంతో లాండ్ ఆర్డర్ కంట్రోల్లో ఉంచుతామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటానని నూతన డీఎస్పీ చెప్పారు.

అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక బస్సులు

గిద్దలూరు రూరల్: తమిళనాడు రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం అరుణాచలం వెళ్లేందుకు భక్తులు సౌలభ్యం కోసం నూతనంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. 25 మందికి మించి భక్తులు ఉంటే బస్సు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉందన్నారు. బస్సు బద్వేలు, కడప మీదుగా అరుణాచలం వెళ్తుందని చెప్పారు. అనంతరం భక్తులు గిరిప్రదక్షిణ చేసుకున్న తర్వాత తిరిగి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ వంటి క్షేత్రాలు చూపించుకుని గిద్దలూరు చేరుకుంటుంది. సూపర్ లగ్జరి బస్సుకు రూ.2,500, అల్ట్రా డీలక్స్‌కు రూ.2000 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు డీఎం తెలిపారు. గిద్దలూరు డిపో నుంచి రోజుకు 73 సర్వీసులు తిరుగుతున్నాయని, రూ.10 నుంచి 15 లక్షల వరకు వసూలు వస్తుందన్నారు. డిపో ఆవరణలోని ఖాళీ స్థలానికి 15 నుంచి 30 సంవత్సరాల వరకు లీజుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జీవన జ్యోతి కళాశాల వద్ద విద్యార్థుల ఆందోళన

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ జీవనజ్యోతి డిగ్రీ కళాశాల వద్ద సోమవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విద్యార్థులకు కళాశాల సిబ్బందికి ఫీజు కట్టించుకునే విషయంలో వాదన ఏర్పడింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగి కళాశాల సిబ్బందిపై వాగ్వాదానికి దిగారు. అనంతరం కళాశాల యాజమాన్యం సూచనల మేరకు ఫీజులు చెల్లింపుల్లో సర్దుబాటు చేయడంతో వివాదం సద్దుమణిగింది.

క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- మార్కాపురంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: జిల్లా క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీకోడిరామమూర్తి ఆరోగ్య క్రీడా సాంస్కృతిక సేవా సంఘం సహకారంతో నిర్వహిస్తున్న వేసవి ఉచిత క్రీడా శిక్షణను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి క్రీడాకారులకు సూచించారు. సోమవారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలపై విద్యార్థి దశ నుంచే ఆసక్తి పెంచుకోవాలని, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా సంఘం ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్న కాళంగి శ్రీనివాసులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పిన్నిక నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు జి.కిరణ్‌కుమార్, కోచ్ రామకృష్ణ, ఎస్.లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఏపీపీ

జిల్లా ఆరో అదనపు న్యాయ స్థానం ఏపీపీగా నియమితులైన ఆర్.బాలునాయక్ సోమవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని కార్యాలయంలో కలిసి సన్మానించారు. సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదల అభ్యున్నతికే నవరత్నాలు


ఓ మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

కొమరోలు: పేదల అభ్యున్నతికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు ప్రవేశ పెట్టారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని ఇడమకల్లు గ్రామ సచివాలయం పరిధిలోని ముక్తాపురం, వెన్నంపల్లి, బసువపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. 102వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మూడున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల పుస్తకాలు అందచేశారు. అనంతరం స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే అన్నా ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చూసుకోవాలంటే ప్రజల ఆశీర్వాదాలు అందించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. నవరత్నాల పథకాలతో పాటు మరిన్ని పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకట నాయుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీలు రామలక్ష్మమ్మ, షేక్ సుభానీ, వైఎస్సార్ సీపీ నాయకులు వాసుదేవరెడ్డి, గోల్కొండ సుభానీ, ఎంపీడీవో శ్రీనివాసకుమార్, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఈవోఆర్‌డీ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

తర్లుపాడు: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆదేశించారు. సోమవారం పోతలపాడు సచివాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రభుత్వం సచివాలయాల ద్వారా 600కు పైగా సేవలు అందిస్తోందని, ఏదైనా సమస్యపై ప్రజలు సచివాలయానికి వచ్చినపుడు వారితో మర్యాపూర్వకంగా మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై స్థానికులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ సుధాకర్, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ పుణ్యవతమ్మ, పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, సచివాలయం కన్వీనర్ బొర్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బోల్తా కొట్టిన లారీ


బోల్తా పడిన లారీ

కొమరోలు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా లారీ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ సంఘటన మండలంలోని ఇడమకల్లు క్రాస్ రోడ్డు వద్ద సోమవారం తెల్లవారు జామున జరిగింది. మిర్యాలగూడ నుంచి కడపకు పేపర్ తయారు చేసే మెటీరియల్‌తో వెళ్తున్న లారీ ఇడమకల్లు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే డ్రైవర్ మొహిద్దీన్ నిద్ర మత్తులోకి జారుకున్నాడు. ఆ వెంటనే లారీ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా క్లీనర్ సురక్షితంగా బయటపడ్డాడు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటనాయుడు

కొమరోలు: వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు కోరారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించేందుకు నిరంతరం గ్రంథాలయాలు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు శిబిరాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం నాడు–నేడు వంటి గొప్ప పథకాన్ని ఏర్పాటు చేసిందని, కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, మాజీ వైస్ ఎంపీపీ పెద్ద సుబ్బరాయుడు, శిక్షకులు సుబ్బారావు, శ్రీధర్‌శర్మ, మాజీ డిప్యూటీ డీఈవో అమరేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ధనలక్ష్మి మృతి బాధాకరం


నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: రామచంద్రాపురం సర్పంచ్ బాదం ధనలక్ష్మి మృతి బాధాకరమని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఆదివారం సాయంత్రం సర్పంచ్ మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం రామచంద్రాపురంలో ఆమె భౌతిక దేహానికి వెంకాయమ్మ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులు, భర్త బాదం చిన్నరెడ్డిని ఓదార్చి సానుభూతి తెలిపారు.

వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు

బేస్తవారిపేట: గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్, తెలుగు గ్రామర్, డ్రాయింగ్, చదవడంపై ఇచ్చే శిక్షణలో విజ్ఞానాన్ని పొందాలని కోరారు. సెలవుల్లో శిక్షణను చిన్న పిల్లలు, విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. జెడ్పీటీసీ బీవీ రాజయ్య, మండల ఉపాధ్యక్షుడు డి.ఖాజామీయా, ఎంపీటీసీ భర్త బాలరంగయ్య, గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పుల్లలచెరువు: మండలంలోని మల్లాపాలెం గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తారని చెప్పారు. వలంటీర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

పూర్వ విద్యార్థుల కలయిక


వీకే ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

తాళ్లూరు: స్థానిక వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1984–85వ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యను అభ్యసించి నేడు వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు సోమవారం సాయంత్రం కలుసుకున్నారు. 37 ఏళ్ల తర్వాత కలుసుకుని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఐలతో పాటు వివిధ వృత్తుల్లో ఉన్న వారు చిన్న నాటి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. తమ ఉన్నతికి పాటు పడిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూత ఇవ్వాల్సిన ఆవశ్యకతను చర్చించుకున్నారు.

తాళ్లూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

తాళ్లూరు: స్థానిక వీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తారక్‌నాథ్‌పై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో సోమవారం మాల మహానాడు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి దాతల చేస్తున్న చేయూతను కూడా నాడు–నేడు పనుల్లో చూపిస్తూ అవినీతికి పాల్పడుతున్నట్లు చెప్పారు. కళాశాల ప్రాంగణంలో చెట్లు, విలువైన సామగ్రికి కూడా లెక్కలు లేకుండా వాటిని మాయం చేస్తున్నారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యతను వారు సమావేశంలో చర్చించారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి


అర్జీ చూపుతున్న కాశీ

మార్కాపురం: స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలని అధికారులను సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి దంపతులు తమ సమస్యపై అర్జీ ఇచ్చారు. మార్కాపురం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన కాశీ తన భార్య 2021 మే 13న కోవిడ్‌తో మరణించిందని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కృష్ణ

మార్కాపురం టౌన్: వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. మంచి సమాజం తయారు కావడానికి గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. తన తండ్రి చెంచయ్య జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఉన్నపుడు మార్కాపురంలో గ్రంథాలయానికి శాశ్వత భవనాన్ని నిర్మించారని, తాను కూడా లైబ్రరీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు శివారెడ్డి, విశ్రాంత వయోజన విద్య ఆర్జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసుదన్, కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం నేడు

ముండ్లమూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీఓ ఆదేశించారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లె సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేపై కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. పాపాయిపల్లె సమీపంలోని పోలేరమ్మ గుడి ఎదురుగా హైవే పక్కన మొబైల్ సోడా మిషన్‌ను షేక్ ఖాదర్‌వలి పెట్టుకున్నాడు. కనిగిరి వైపునకు వెళ్తున్న కారు అదుపుతప్పి కూలింగ్ సోడా మిషన్‌ను ఢీకొట్టింది. పక్కనే ఉన్న ఖాదర్‌వలి తీవ్రంగా గాయపడ్డాడు. కూలింగ్ మిషన్, ఖాదర్‌వలికి చెందిన మోటార్ సైకిల్ ముందు భాగం ధ్వంసమైంది. క్షతగాత్రుడిని 108లో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ మాధవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


తీవ్రంగా గాయపడిన మస్తాన్ వలి

లారీలు ఢీ, డ్రైవర్లకు గాయాలు

మేదరమెట్ల: రెండు లారీలు ఢీకొట్టుకోవడంతో ఇరువురి డ్రైవర్లకు గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన లారీ డివైడర్ దిమ్మెలను గుద్దుకుంటూ మరో రోడ్డులో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విజయవాడ వైపు నుంచి వస్తున్న లారీ పీ.గుడిపాడు జాతీయ రహదారి సమీపానికి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో అదుపు తప్పిన లారీ రోడ్డు మధ్యలో డివైడర్‌గా ఉంచిన సిమెంటు దిమ్మెలను ఢీ కొట్టుకుంటూ ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్లు ఇద్దరికి గాయాలయ్యాయి. ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో స్థానికులు, పోలీసులు కష్టించి బయటకు తీసి చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల ఎస్సై పీ.నాగశివారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించి, కేసు నమోదు చేశారు.


క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

సీఎంలా అందరికీ న్యాయం చేశా

- కులాలు, మతాలు, పార్టీలు చూడలేదు
- వీడ్కోలు సభలో డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి


సన్మానం అందుకుంటున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

దర్శి: కులం చూడం, మతం చూడం, పార్టీలు చూడమంటూ సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలా తానూ దర్శి సబ్ డివిజన్‌లో పోలీసు విధులు నిర్వర్తించానని డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి అన్నారు. స్థానిక పీజీఎన్ సమావేశం హాలులో బదిలీపై వెళ్లిన నారాయణస్వామిరెడ్డికి దర్శి పోలీసులు సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. నారాయణస్వామిరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతగా పని చేస్తే ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. తప్పులు జరిగినప్పుడు అధికారులపై కోప్పడి ఉంటే తప్పుగా అనుకోవద్దన్నారు. తనకు ఎవరిపైనా ప్రత్యేకించి కోపం ఉండదన్నారు. కార్యక్రమంలో సీఐ జె. రామకోటయ్య, ఎస్ఐ రామకృష్ణ, సంఘ సేవకుడు జీవీ రత్నం పాల్గొన్నారు.